వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 334 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూన్ 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|



## స్థానిక సమరంపై సర్కార్ కసరత్తు

జులై లేదా ఆగస్టులో?





### మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ..తర్వాతనే సర్పంచ్ ఎన్నికలు

- నేడు మంత్రులతో సీఎం ప్రత్యేక సమావేశం
- ఒడు దశల్లోనే పూర్తిచేసే యోచన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కష్టమే
- పార్టీగా ఆ సంఖ్యలో బీసీ అభ్యర్థులను నిలిపే యోచనలో కాంగ్రెస్
- బీజేపీ కోర్టులోకి రిజర్వేషన్ బంతి

హైదరాబాద్

స్థానిక సంస్థల పోరుకు కాంగ్రెస్ సర్కారు సన్నద్ధమవుతున్నది. జులై చివర్లోగానీ, ఆగస్టు మొదట్లోగానీ నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నట్టు ప్రభుత్వ వర్గాల నుంచి లీకులు బయటకు వస్తున్నాయి. మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించబోతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఆ తర్వాతనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి.

-మిగతా 3 లో

## వారంలో రైతుభరోసా



- ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమం
- రైతుల హామీల అమల్లో ప్రభుత్వం చిత్తశుద్ధి
- 18 నెలల్లోనే రూ. 21 వేలకోట్ల రుణమాఫీ
- ఏరువాక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి-

వారంలోగా రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆరుగాలం కష్టపడి దేశ ప్రజలకు అన్నంపెట్టే రైతన్నలకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఆదివారం ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. జోడెడ్ల అరక దున్ని రైతులతో కలిసి విత్తనాలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తాను అమితంగా ప్రేమించే పాలేరు నియోజకవర్గ రైతన్నలు ఏర్పాటు చేసుకున్న ఏరువాక సాగు కార్యక్రమంలో అరక పట్టి, దుక్కిదున్ని, రైతులతో కలిసి విత్తనాలు నాటడం

-మిగతా 3 లో



## సైప్రస్‌లో మోడీ

### మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధానికి ఘనస్వాగతం

నికోసియా

మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ ఆదివారం ద్వీప దేశమైన సైప్రస్‌కు చేరుకున్నారు. దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ఆయనకు స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు ఈ పర్యటన కొనసాగనుంది. 23 ఏండ్ల తర్వాత ఓ భారత ప్రధాని సైప్రస్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇందులో భాగంగా క్రిస్టోడౌలైడ్స్‌తో మోడీ సమావేశం కానున్నారు. వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పునరుత్పాదక ఇంధనం, కౌంటర్ టెర్రరిజం తదితర రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకునే దిశగా చర్చలు జరపనున్నారు

-మిగతా 3 లో



## మీ 'స్కిల్'కు సహకరిస్తాం

- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయండి
- సీఎం రేవంత్‌రెడ్డితో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి భేటీ

హైదరాబాద్

రాష్ట్రంలో ఏర్పాటుచేసిన స్కిల్ యూనివర్సిటీకి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని కేంద్ర పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి జయంత్ చౌదరి చెప్పారు. ఆదివారంనాడాయన జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి

-మిగతా 3 లో




## విదేశాంగ విధానం గందరగోళం

- ఐరాస తీర్మానంపై ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టిన కాంగ్రెస్

న్యూఢిల్లీ

గాజాలో కాల్పుల విరమణ కోరుతూ ఐక్యరాజ్య సమితి ఆమోదించిన తీర్మానంపై ఓటింగ్ జరిగినప్పుడు భారత్ గైర్హాజరు కావడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. భారత విదేశాంగ విధానం అస్తవ్యస్థంగా, గందరగోళంగా ఉన్నదని విమర్శించింది. పశ్చిమాసియాలో శాంతి స్థాపన కోసం కాల్పుల విరమణ పాటించి చర్చలు జరపాలంటూ ఇప్పటి వరకూ

-మిగతా 3 లో



## వరల్డ్ వార్-3 దిశగా! ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం తీవ్రం..

- యుద్ధంలో చేరాలని అగ్రరాజ్యానికి ఇజ్రాయెల్ విజ్ఞప్తి
- పశ్చిమాసియాలో ఫైటర్‌జెట్లు మోహరిస్తున్న బ్రిటన్
- మాపై దాడి చేస్తే కనీవినీ ఎరుగని రీతిలో స్పందిస్తాం
- టెహ్రాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

న్యూఢిల్లీ,

ఇరాన్- ఇజ్రాయిల్ మధ్య మొదలైన యుద్ధ వాతావరణం క్రమంగా ప్రపంచ యుద్ధం దిశగా మారుతున్నది. రెండు దేశాలతో పాటు ఆయా పక్షాల వైపు ప్రపంచ దేశాలు తమ సైనిక శక్తిని మోహరిస్తుండటం గుబులురేపుతున్నది. ఇరాన్‌పై యుద్ధంతో తమతో కలవాలని అగ్రరాజ్యం అమెరికాకు ఇజ్రాయెల్ విజ్ఞప్తి చేసినట్టు ఇద్దరు ఉన్నతాధికారులను ఉటంకిస్తూ 'ఆక్సియోస్' తన వార్తా కథనంలో పేర్కొంది. ఇరాన్ యురేనియం శుద్ధి కేంద్రాన్ని లోతైన భూగర్భంలో నిర్మించారని, అయితే దానిని ధ్వంసం చేసే శక్తి సామర్థ్యాలు తమకు లేవని, అమెరికా కనుక

-మిగతా 3 లో

## నేడు ఏసీబీ ఆఫీస్‌కు కేటీఆర్

- బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఏసీబీ కార్యాలయంలో విచారణకు హాజరు



హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన ఫార్ములా-ఈ కేసు విచారణ నేపథ్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు తెలంగాణ భవన్ చేరుకుంటారు. అనంతరం ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఏసీబీ కార్యాలయంలో విచారణకు హాజరు కానున్నారు.

-మిగతా 3 లో

## ఆస్పత్రిలో సోనియా గాంధీ

- ఉదర సంబంధిత సమస్యలతో చేరిక
- వైద్యుల పర్యవేక్షణ




న్యూఢిల్లీ

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఆదివారం దిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరారు. ఉదర సంబంధిత సమస్యలతో

-మిగతా 3 లో

## తెలంగాణలో ఐదురోజులు వానలు..!

### ఉపరితల ద్రోణి ప్రభావం.



హైదరాబాద్

తెలంగాణలో ఈ నెల 19 వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు

-మిగతా 3 లో

# 25 మృతదేహాలు అప్పగింత

విమాన ప్రమాద మృతుల గుర్తింపునకు ముమ్మర ప్రయత్నాలు..




**అహ్మదాబాద్ -జూన్ 15- ప్రజా స్వేచ్ఛ**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జూన్ 12న కూలిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారిని గుర్తించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. డీఎన్ఏ పరీక్షల్లో నిర్ధారణ అయిన 25 మంది మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించారు. బాధిత కుటుంబాలకు సహాయం, సమన్వయం కోసం 230 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు రిలీఫ్ కమిషనర్, ఐఏఎస్ అధికారి అలోక్ పాండే తెలిపారు. ప్రతి బృందంలో ఒక పోలీసు అధికారి, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి, ఒక ప్రొఫెషనల్ కౌన్సెలర్ ఉన్నట్లు చెప్పారు. డీఎన్ఏ టెస్ట్‌ల ద్వారా గుర్తించిన మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 22 మరణ ధృవీకరణ పత్రాలు జారీ చేసినట్లు వెల్లడించారు. చట్టపరమైన లాంఛనాలను పూర్తి చేయడానికి 22 విచారణ బృందాలు కూడా పనిచేస్తున్నాయని అన్నారు.కాగా, ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో 270 మందికిపైగా మరణించారు. చాలా మంది గుర్తుపట్టలేనంతగా కాలిపోయారు. ఈ నేపథ్యంలో అహ్మదాబాద్‌లోని సివిల్ హాస్పిటల్‌లో మృతుల గుర్తింపు కోసం డీఎన్ఏ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ రజనీష్ పటేల్ తెలిపారు. ఇప్పటి వరకు 47 డీఎన్ఏ టెస్ట్‌లు మ్యాచ్ అయ్యాయని చెప్పారు. 44 కుటుంబాలను సంప్రదించామని అన్నారు. 25 మృతదేహాలను వారి బంధువులకు అప్పగించినట్లు వెల్లడించారు. మరోవైపు శాంతిభద్రతలు, లాజిస్టిక్స్ కోసం సివిల్ ఆసుపత్రి వద్ద ఏడుగురు ఐపీఎస్ అధికారులతోపాటు 500 మంది పోలీస్ సిబ్బందిని మోహరించినట్లు సీనియర్ పోలీసు అధికారి జైపాల్ ఎస్ రాథోడ్ తెలిపారు. ఎలాంటి ఆలస్యం లేకుండా బాధిత కుటుంబాలకు మృతదేహాలు చేరేలా సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు.

# రాజ్‌కోట్‌లో విజయ్ రూపానీ అంత్యక్రియలు..

గుజరాత్ వ్యాప్తంగా సంతాప దినం..!



**అహ్మదాబాద్ -జూన్ 15- ప్రజా స్వేచ్ఛ**

ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ అంత్యక్రియలు సోమవారం జరుగనున్నాయి. రాజ్‌కోట్‌లో ఆయన పార్థీవ దేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. దాంతో, గుజరాత్ ప్రభుత్వం అధికార లాంఛనాలతో ఆయనకు నివాళులు అర్పించనుంది. అంతేకాదు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సంతాప దినం పాటిస్తామని తెలిపింది సర్కార్.ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను అవనతం చేస్తామని, ఆ రోజు ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టబోమని ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. జూన్ 12న జరిగిన ఎయిరిడింయా బోయింగ్ ఏ1 171 డ్రీమ్ లైనర్ ప్రమాదంలో విజయ్ రూపానీ కన్నుమూశారు. యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన ఈ ఘటనలో విమానంలోని 241 మంది అసువులు బాశారు. ప్రమాద స్థలి నుంచి మృత దేహాల్ని సేకరించిన ఫోరెన్సిక్ బృందం ఆదివారం డీఎన్ఏ పరీక్షలు జరిపింది. రూపానీ డీఎన్ఏ మ్యాచ్ కావడంతో ఆయన కుటుంబసభ్యులుకు మృతదేహాన్ని అప్పగించారు. మరో 86 మందిని కూడా గుర్తించినట్టు గుజరాత్ హోం మంత్రి హర్ష్ సంఘవి తెలిపారు. బీజేపీకి చెందిన విజయ్ రూపానీ 2016 నుంచి 2021 వరకూ గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవలందించారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రతిరోజు ఉగ్రదాడులు



**హైదరాబాద్ -జూన్ 15- ప్రజా స్వేచ్ఛ**

కాంగ్రెస్ పాలనలో ఉగ్రవాదుల దాడులను అరికట్టడంలో విఫలమైయ్యారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మోడీ పాలనలో ఉగ్రదాడులు జరిగితే..దీటైన సమాధానం ఇచ్చామన్నారు. ఉరి పై దాడి చేస్తే సర్జికల్ దాడి చేశామని, పుల్వామా ఎటాక్‌కు ప్రతీకారంగా వైమానిక దాడిచేశామని, పహల్గాం మారణోమంతో..ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్థాన్ లోని ఉగ్రవాదలను అంతంచేశామని అమిత్ షా గుర్తు చేశారు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో కొత్తగా ఎంపికైన 60,000 మందికి పైగా పోలీసు కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. రక్తపాతం సృష్టించడం భారత్ ఉద్దేశ్యంకాదు..ఇండియాపై దాడి చేయడానికి ధైర్యం చేస్తే..ఖచ్చితంగా వారికి తగిన గుణపాఠం చెపుతామని కేంద్ర హోంమంత్రి అన్నారు. 2014కి ముందు కాంగ్రెస్ పాలనలో ప్రతిరోజూ ఉగ్రవాద దాడులు జరిగాయని ఆయన ఆరోపించారు.

# ఢిల్లీలో కరోనా విలయం..

మహమ్మారితో ఒకే రోజు ముగ్గురు మృతి..!



**ఢిల్లీ-జూన్ 15- ప్రజా స్వేచ్ఛ**

దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి మళ్లీ విస్తరిస్తున్నది. ఢిల్లీలోనూ కరోనా విధ్వంసం కొనసాగుతున్నది. తొలిసారిగా దేశ రాజధానిలో కరోనా వైరస్‌తో ఒకే రోజులో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటి వరకు ఢిల్లీలో కరోనా కారణంగా 11 మంది మరణించారు. ఢిల్లీలో మరణించిన ముగ్గురిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. 57 ఏళ్ల మహిళకు డయాబెటిస్, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నాయి. మరో వ్యక్తికి సైతం ఇవే సమస్యలున్నట్లుగా గుర్తించారు. అలాగే, 83 ఏళ్ల మహిళకు డయాబెటిస్, హై బీపీ, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నాయి. అయితే, యాక్టివ్ కరోనా రోజుల్లో తగ్గుదల కనిపించింది. శనివారం యాక్టివ్ రోగుల సంఖ్య 672కి తగ్గింది. జనవరి నుంచి ఇప్పటి వరకు ఢిల్లీలో కొవిడ్‌తో 11 మంది ప్రాణాలు కోల్పోయరు.ముగ్గురి మరణానికి కొవిడ్ మాత్రమే కారణం కాదని.. వారికి ఉన్న దీర్ఘకాలిక వ్యాధులు సైతం కారణమని వైద్యులు తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వివరాల ప్రకారం.. 24గంటల్లో 212 మందికి కొవిడ్ పాజిటివ్‌గా తేలింది. దేశంలో నమోదైన మొత్తం కేసుల్లో ఢిల్లీ రెండోస్థానంలో ఉన్నది. కొవిడ్ కేసులకు కొత్త వేరియంట్ కారణమని భావిస్తున్నారు. అయితే, వాటితో అంతగా ప్రమాదమేమీ లేదని.. గతంలో వేరియంట్ల తరహాలో ప్రాణాంతకం కావని పేర్కొన్నారు. అయితే, వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. తేలికపాటి లక్షణాలు కనిపించినా.. ఆ తర్వాత తీవ్రమైన శ్వాసకోశ సమస్యల వరకు పెరగవచ్చని పేర్కొంటున్నారు. కరోనా సాధారణ లక్షణాల్లో చలిగా ఉండడం, పొడిదగ్గు, గొంతునొప్పి, ఒంటినొప్పులు, అలసట, వాసన, ఉచి చూసే సామర్థ్యం తగ్గిపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా అనిపిస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే, కొవిడ్ కేసులు పెరుగుతున్నాయని భయపడాల్సిన, ఆందోళన చెందాల్సిన పని లేదని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, జలుబుతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో బాధపడుతున్న రోగులు వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకొని.. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధాన్ని ఆపుతా..!

మరోసారి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గప్పాలు..!




**అమెరికా-జూన్ 15- ప్రజా స్వేచ్ఛ**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన గప్పాలు కొట్టుకున్నారు. గతంలో భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించానని చెప్పుకున్నారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. రెండుదేశాలు క్షిపణులతో దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ సోషల్ మీడియా పోస్ట్‌లో ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు చర్చల్లో నిమగ్నమైనట్లు పేర్కొన్నారు. చర్చలు జరుపుతున్నామని.. సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య శాంతి ఏర్పడుతుందంటూ సోషల్ మీడియా ట్రూత్ పోస్ట్‌లో పేర్కొన్నారు. తన మధ్యవర్తిత్వంలో ఎన్నో దేశాల మధ్య శాంతి నెలకొందన్న ఆయన.. ఆ క్రెడిట్ మాత్రం తాను తీసుకోలేదన్నారు. ఇటీవల తన వల్లే నెల రోజుల కిందట భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని రాసుకొచ్చారు.న సోషల్ మీడియా పోస్ట్‌లో ట్రంప్ ఇతర అంతర్జాతీయ వివాదాలు, ఉద్రిక్త పరిస్థితులను ప్రస్తావిస్తూ.. అందులో తాను జోక్యం చేసుకోవడంతో ఉద్రిక్తతలు తగ్గాయన్నారు. సెర్బియా-కొసోవాలాలో దశాబ్దాలుగా ఉన్న ఈ ఉద్రిక్తతలు తగ్గించానని చెప్పుకొచ్చారు. గతంలో బైడెన్ నిర్ణయాలతో దీర్ఘకాలిక అవకాశాలు దెబ్బతిన్నాయని.. బైడెన్ నిర్ణయాలతో జరిగిన తప్పిదాలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నైలు నదిపై ఆనకట్ట విషయంలోనూ ఈజిప్ట్-ఇథియోపియా మధ్య పోరాటం జరిగిందని.. తన జోక్యం వల్లే ఇరుదేశాల మధ్య శాంతి నెలకొందని పేర్కొన్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య త్వరలోనే శాంతి నెలకొంటుందని.. ఈ విషయంలో ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తాను ఏది చేసినా దేనికీ క్రెడిట్ పొందలేదని.. ప్రజలు అర్థం చేసుకుంటారన్నారు. అయితే, ఇజ్రాయెల్‌పై ఆత్మరక్షణ కోసమే దాడులు చేశామని.. దేశం సైనిక చర్యలను నిలిపివేస్తే ప్రతిదాడులను నిలిపివేస్తామని ఇరాన్ ప్రకటించింది. ఆ తర్వాత కొద్దిసేపటికే ట్రంప్ ఈ ప్రకటన చేశారు. వాస్తవానికి అంతకు కొద్దిసేపటికి ముందే ఇరాన్‌ను సోషల్ మీడియా పోస్ట్‌లోనే హెచ్చరించడం గమనార్హం. ఇజ్రాయెల్ చేసిన దాడులతో యూఎస్‌కు సంబంధం లేదని.. తమపై దాడికి ప్రయత్నిస్తే కనీవినీ ఎరుగతి రీతిలో టెహ్రాన్‌పై దాడి చేస్తామని హెచ్చరించడం ప్రస్తావనార్హం. గతంలోనూ భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నెలకొన్న విషయం తెలిసిందే. భారత్ దాడులకు బెంబేలెత్తిన పాకిస్తాన్ దిగివచ్చింది. తన వల్లే ఉద్రిక్తతలు తగ్గాయని ట్రంప్ క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేశారు. వాణిజ్యాన్ని ఉపయోగించి రెండుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించినట్టు చెప్పుకోగా.. భారత్ మాత్రం ఆ వ్యాఖ్యలను ఖండించింది.

# మరో ఘోర ప్రమాదం.. కుప్పకూలిన హెలికాప్టర్



**ఢిల్లీ-జూన్ 15- ప్రజా స్వేచ్ఛ**

ఉత్తరాఖండ్‌లోని గౌరీకుండ్‌లో హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో చిన్నారి సహా ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఆర్యన్ ఏవియేషన్‌కు చెందిన హెలికాప్టర్ గుప్తకాశీ నుంచి కేదార్‌నాథ్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో పైలట్ కూడా ఉన్నారు. ఉత్తరాఖండ్ పౌర విమానయాన అభివృద్ధి అథారిటీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున 5:20 గంటలకు ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన 6 మంది యాత్రికులతో హెలికాప్టర్ గుప్తకాశీ నుంచి కేదార్‌నాథ్‌కు బయల్దేరింది. అందులో సాంకేతిక సమస్యలు తలెత్తడం, వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో బయల్దేరిన 10 నిమిషాల్లోనే కుప్పకూలింది. సమాచారం అందుకున్న అధికారులు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం , ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మే 2న కేదార్‌నాథ్ ద్వారాలు తెరుచుకున్నప్పటి నుంచి ఇది ఐదో ప్రమాదం. జూన్ 7న ఉత్తర్‌ప్రదేశ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో కేదార్‌నాథ్‌కు వెళ్తున్న ఓ హెలికాప్టర్ బాదాసుబేస్ నుంచి టేకాఫ్ అయిన వెంటనే అందులో సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో ఉత్తరాఖండ్‌లోని ఓ హైవేపై అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. హెలికాప్టర్ టెయిల్ రోటర్ పడి సమీపంలోని కొన్ని భవంతులు, రోడ్డుపై నిలిపి ఉంచిన ఓ కారు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పైలట్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

# మోదీ రిటైర్‌మెంట్ ప్రకటించి.. అమిత్‌షాను ప్రధానిని చేయాలి..

కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు



**అహ్మదాబాద్ -జూన్ 15- ప్రజా స్వేచ్ఛ**

అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విమాన ప్రమాదానికి బాధ్యత వహిస్తూ పౌరవిమానయాన శాఖ మంత్రిగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విమానయాన శాఖ ఎంతో క్లిష్టమైనదని.. చిన్నవాడైన రామ్మోహన్ నాయుడికి ఏవియేషన్‌పై అవగాహన లేదని అన్నారు. రామ్మోహన్ ఒక్క గంట కూడా విమానయాన రంగం గురించి చదవలేదని పేర్కొన్నారు. అందుకే రామ్మోహన్ నాయుడిని భర్తరఫ్ చేసి, ఏవియేషన్‌పై అనుభవం ఉన్న ఎంపీకి విమానయాన శాఖ బాధ్యతలు అప్పగించాలని ప్రధాని మోదీని కోరారు.రామ్మోహన్ నాయుడితో తనకు వ్యక్తిగత గొడవలు ఏమీ లేవని కేఏ పాల్ స్పష్టం చేశారు. ఆయనకు కేబినెట్‌లో ఇంకా వేరే పదవి రావాలని కోరుకుంటానని అన్నారు. కానీ భారత ప్రతిష్టను దృష్టిలో ఉంచుకుని విమానయాన శాఖ మంత్రి పదవి నుంచి రామ్మోహన్ నాయుడిని తొలగించాలని కోరారు. ప్రధాని మోదీపై అనేక దేశాల నుంచి ఒత్తిడి రాకముందే రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ కూడా రిటైర్‌మెంట్ ప్రకటించాలని.. ప్రధాని బాధ్యతను అమిత్‌షాకు అప్పగించాలని డిమాండ్ చేశారు.అంత పెద్ద విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియా సీఈవో, విదేశాంగ మంత్రి రాజీనామా చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందని కేఏ పాల్ తెలిపారు. భారత ప్రతిష్ట కాపాడటం కోసం తప్పు చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. జీ7 సమ్మిట్‌లో విమాన ప్రమాదంపై చర్చ జరగనుందని తెలిపారు. ముందస్తు ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇది ఉగ్రవాదుల దాడి అయ్యి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

# స్థానిక సమరంపై సర్కారు కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

సాధారణంగా జులై వ్యవసాయ పనుల సీజన్. రైతులంతా ఆ పనుల్లో బిజీగా ఉంటారు కాబట్టి ఒకటెండ్రు నెలలు సాగదీస్తే ఎలా ఉంటుందనే చర్చను కూడా కాంగ్రెస్‌లోని కొందరు లేవనెత్తుతున్నారు. అయినా, ముందుకే వెళ్లాలని సీఎం సహా పలువురు కీలక మంత్రులు అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అందులో ప్రధానంగా స్థానిక సంస్థలు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం, ఇతర సంక్షేమ పథకాలపైనా చర్చించే అవకాశముంది. అయితే, ప్రధానంగా స్థానిక పోరుపైనే చర్చ నడిచే సూచనలున్నాయి. ప్రభుత్వ నిర్ణయం తర్వాత కొద్ది రోజుల్లోనే ఎన్నికల సంఘం నుంచి నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయి. గతంలో సాధారణంగా మూడు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేవారు. కానీ, ఈసారి మాత్రం రెండు విడతల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించ బోతున్నట్టు తెలుస్తోంది. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనూ తొలుత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను నిర్వహించారు. అదే పద్ధతిని ఈసారి అమలు చేసేలా కాంగ్రెస్ సర్కారు కసరత్తు చేస్తున్నది. మొదట ఈ ఎన్నికలు నిర్వహిస్తే పార్టీకి మేలు జరుగుతుందని కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తున్నది. అందులో భాగంగానే ప్రజల మూడ్‌ను పసిగట్టేందుకు మంత్రులు కూడా అక్కడక్కడా స్థానిక పోరుపై ప్రస్తావిస్తున్నారు. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే నాటికి రైతు భరోసా నిధులను విడుదల చేయాలనే యోచనలో రాష్ట్ర సర్కారు ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ సర్కారు చేస్తున్న పనులను ప్రజలకు విడమర్చి చెప్పేందుకు ప్రజల్లోనే ఎమ్మెల్యేలు, మంత్రులుం టున్నారు. మంత్రులు కూడా తమ ప్రోగ్రెస్ రిపోర్టులను విడుదల చేస్తున్నారు.

42 శాతం చట్టబద్ధంగా కష్టమే..పార్టీగా ఇచ్చేందుకు మొగ్గు

అయితే, బీసీలకు ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు కష్టమేననే అభిప్రాయానికి రాష్ట్ర సర్కారు వచ్చినట్టు తెలిసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర సర్కారు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రం కోర్టులోకి బంతి విసిరింది. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణనను కూడా చేస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే అది చట్టరూపం దాల్చాల్సిందే. ఇప్పట్లో అది సాధ్యమయ్యేటట్టు లేదు. కాంగ్రెస్ పార్టీ జిల్లాల ప్రాతిపదికన 42 శాతం మంది బీసీ అభ్యర్థులకు జెడ్పీటీసీ, ఎంపీటీల స్థానాలను ఇవ్వాలని భావిస్తున్నది. అదే సమయంలో బీజేపీ వల్లనే స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వలేకపోయామనే వాణిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ఆలోచనలో రాష్ట్ర సర్కారు ఉంది.

**కేంద్రం నుంచి నిధులు ఆగటంతోనే..**

ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక ప్రజాప్రతినిధులు లేరు. ఇటు పట్టణాల్లోనూ, అటు పల్లెలోనూ ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. పాలకమండళ్లు లేవనే సాకుతో 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడం ఆపేసింది. ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచీ కూడా సరిగా నిధులు అందని పరిస్థితి. దీంతో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు తమ చేతుల్లోంచి డబ్బులు పెట్టి అభివృద్ధి పనులు చేయిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో పాలన పడకేసింది. మరోవైపు బీఆర్ఎస్ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికలు క్రమం తప్పకుండా నిర్వహించారనే పేరుంది. ఈ విషయంపై ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శల దాడిని ఎక్కుపెట్టాయి. ఇది ఇంకా సాగదీస్తే బాగుండదనే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉంది.

# మీ 'స్కిల్'కు సహకరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని కేంద్రమంత్రికి వివరించారు. నిరుద్యోగులకు ప్రయివేటురంగంలో ఉపాధి అవకాశాలను పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ దోహదపడుతుందని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా వివిధ ప్రయివేటు సంస్థలు ప్రమోట్ చేస్తున్న శిక్షణా తరగతులు, కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి జయంత్ చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో వీఎఫ్ఎక్స్, గేమింగ్, ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఐటీఐ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఇది ఉపయోగంగా ఉంటుందనీ, ఐటీఐలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసి, దాన్ని ఐటీఐలకు అనుసంధానిస్తామని చెప్పారు. ఐటీఐల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు. ఆధునిక పరిశ్రమ అవసరాలకు తగినట్టు ఐటీఐల్లో సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలనీ, దీనికోసం ప్రత్యేక కమిటీ నియమించాలని చెప్పారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, సీఎంవో పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం సీఈవో జయేశ్‌రంజన్, పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు. సోమవారం జరగ నున్న కౌశల్‌మందన్ కార్యక్రమంలో హాజరయ్యేందుకు కేంద్రమంత్రి జయంత్ చౌదరి హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సీఎంను కలిశారు

# వరల్డ్ వార్-3 దిశగా!
## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం తీవ్రం..

(మొదటి పేజీ తరువాయి)

తమతో యుద్ధంలో కలిస్తే వాటిని సులభంగా ధ్వంసం చేయవచ్చునని ఇజ్రాయెల్ కోరింది. కాగా, ఆ అణు కేంద్రానికి సమీపంలోనే అమెరికన్ తన బాంబర్లను మోహరించిందని ఆ మీడియా సంస్థ వెల్లడించింది. ఆ అణు కేంద్రంపై కనుక అమెరికా దాడికి దిగితే అగ్రరాజ్యం కూడా యుద్ధంలో నేరుగా పాల్గొన్నట్టే. అవసరమైతే తాము నేరుగా యుద్ధంలో అడుగుపెడతామని ఇప్పటికే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ హామీ ఇచ్చారని ఆ వార్తాసంస్థ తెలిపింది. కాగా, తమతో యుద్ధంలో పాల్గొనమని ఇజ్రాయెల్ విజ్ఞప్తి చేసిన మాట వాస్తవమేనని, దానిని తాము తిరస్కరించామని అమెరికా అధికారులు తెలిపారు. సాధ్యమైనంత వరకు చర్చల ద్వారా శాంతియుతంగానే సమస్యను పరిష్కరించేందుకు ట్రంప్ కృషి చేస్తారని పేర్కొన్నారు.

**మధ్యప్రాచ్యానికి బ్రిటన్ జెట్‌లు**

రెండు దేశాల మధ్య తీవ్రమైన పోరు జరుగుతున్న క్రమంలో జెట్‌లు, ఇతర మిలిటరీ సామగ్రిని తాము పశ్చిమాసియాకి తరలిస్తున్నట్టు బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ తెలిపారు. అయితే తాము ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడాన్ని ఆయన తోసిపుచ్చుతూ తమ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా మాత్రమే తాము వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో అత్యవసర సహాయం కోసమే తాము జెట్‌లు, ఇతర సామగ్రిని తరలించామని ఆయన పేర్కొన్నట్టు రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది.

**ఫ్రాన్స్ అప్రమత్తం**

తాజా పరిస్థితుల నేపథ్యంలో ఫ్రాన్స్ అప్రమత్తమైంది. తమ భూభాగంలో యూదులు, అమెరికన్లు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని నిర్ణయించింది. ప్రత్యేకంగా ప్రార్థనాస్థలాలు, పాఠశాలలు, విద్యాసంస్థలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలతో పాటు మత సంబంధమైన సమావేశాలు జరిగే ప్రాంతాలపై నిఘా పెంచాలని ఫ్రాన్స్ మంత్రి బ్రూనో ఆదేశించారు.

**మాపై దాడికి పాల్పడ్డారో ఖబడ్దార్: ట్రంప్**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో అమెరికాకు ఎలాంటి పాత్ర లేదని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. తమ స్థావరాలపై ఇరాన్ ఎలాంటి ప్రతీకార దాడులకు పాల్పడినా కనీవినీ ఎరుగని స్థాయిలో చర్యలు తీవ్రంగా ఉంటాయని తీవ్రంగా హెచ్చరించారు. 'ఇరాన్ మాపై ఏ విధంగానైనా, ఏ రూపంలోనైనా దాడి చేస్తే ఇంతకు ముందెన్నడూ లేని విధంగా అమెరికా సాయుధ దళాలు పూర్తి బలం, శక్తితో మీ పైకి వస్తుంది' అని ఆయన హెచ్చరించారు. శనివారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో అమెరికాకు ఎలాంటి ప్రమేయం లేదని ఆయన తన ట్రూత్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఆదివారం అమెరికాతో జరగాల్సిన ఆరో విడత అణు చర్చలను టెహ్రాన్ రద్దు చేసుకున్నప్పటికీ తాను ఈ రెండు దేశాల మధ్య ఏర్పడిన సంక్షోభాన్ని సులభంగా పరిష్కరించగలనని ఆయన అన్నారు.


**యుద్ధం అంచున ప్రపంచ దేశాలు**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ వాయుసేనతో దాడులు ప్రారంభించగానే గతంలో ఎన్నడూ లేని విధంగా మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే పరిస్థితులు ఈసారి ఏర్పడనున్నాయని అమెరికాకు చెందిన ఒక ఉన్నతాధికారి హెచ్చరించారు. ప్రపంచం గతంలో ఎన్నడూ లేనంతగా ప్రపంచ యుద్ధానికి దగ్గరలో ఉందని, ప్రస్తుత మూడో ప్రపంచ యుద్ధ ముప్పు ప్రచ్ఛన్న యుద్ధ యుగం కంటే కూడా ప్రమాదరమైనదని, ఆ ముప్పు దగ్గరలోనే ఉందని వాషింగ్టన్ పోస్ట్ నివేదిక పేర్కొంది.

# తెలంగాణలో ఐదురోజులు వానలు..!

(మొదటి పేజీ తరువాయి)

వీస్తాయని పేర్కొంది. దక్షిణ బంగ్లాదేశ్‌ను ఆనుకొని ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంపైనున్న ఆవర్తనం ప్రస్తుతం పరిసర ప్రాంతాలు, సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి దిశగా వంగి ఉందని తెలిపింది. ఉత్తరకోస్తాంధ్ర, పశ్చిమ బంగాళాఖాతంపై సముద్రమట్టానికి 5.8 కిలోమీట్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని.. ఈ ఆవర్తనం ఉత్తర బంగాళాఖాతంపై ఏర్పడిన ఆవర్తనంలో కలిసిపోయిందని పేర్కొంది.తూర్పు మధ్యప్రదేశ్ నుంచి బంగ్లాదేశ్ వరకు ఛత్తీస్‌గఢ్, జార?ండ్, గంగానది మీదుగా ఓ ద్రోణి.. సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని తెలిపింది. మరాఠ్వాడ, పరిసర ప్రాంతాల మీదుగానున్న ఉపరితల ఆవర్తనం నుంచి తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకు



సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి ఉందని తెలిపింది. ఈ క్రమంలో ఆదివారం సిద్దిపేట, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నాయని చెప్పింది. మంగళశారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# వారంలో రైతుభరోసా

(మొదటి పేజీ తరువాయి)

సంతోషాన్నిచ్చిందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ కార్యక్రమా లు అమలు చేస్తూ రైతును రాజు చేయాలనేదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక స్థితి బాగోలేకపోయినా ప్రభుత్వం రైతులను ప్రోత్సాహిస్తోంద న్నారు. గత ప్రభుత్వం పదేండ్లలో రైతులకు రూ.17000 కోట్ల రుణమాఫీ చేస్తే, తమ ప్రభుత్వం 18 నెలల్లోనే రూ.21000 కోట్లు మాఫీ చేసిందని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇబ్బంది లేకుండా పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. గత ప్రభుత్వం వారి స్వార్థం కోసం ప్రాజెక్టులు మొదలు పెట్టి అర్ధాంతరంగా వదిలేస్తే వాటిని పూర్తి చేస్తూ సాగు నీటిని అందిస్తామన్నారు. వ్యవసాయానికి యోగ్యమైన ప్రతి ఎకరానికీ పెట్టుబడి కోసం రూ.12 వేలు ఇస్తామన్నారు. రైతు భరోసా ఇప్పటికే రెండు సార్లు ఇచ్చామని, వారంలోగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. కాళేశ్వరం కూలినా కూడా దేశంలో అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా మొదటి స్థానంలో ఉన్నామని తెలిపారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

# సైప్రస్‌లో మోడీ

(మొదటి పేజీ తరువాయి)

. మూడు దేశాల పర్యటనకు బయల్దేరే ముందు ప్రధాని మోడీ ఓ ట్వీట్ చేస్తూ.. మధ్యధరా, ఈయూ ప్రాంతంలో సైప్రస్‌ను విలువైన భాగస్వామిగా పేర్కొన్నారు. ఈ పర్యటన ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సాంస్కృతికం వంటి కీలక రంగాల్లో సంబంధాలను మరింత పెంపొదిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్- ఇరాన్ పరస్పర దాడుల కారణంగా పశ్చిమాసియాలో గగనతల ఆంక్షల నేపథ్యంలో ప్రధాని మోడీ విమానం అరేబియా సముద్రం, ఆఫ్రికా గగనతలం మీదుగా సైప్రస్‌కు చేరుకున్నట్టు సమాచారం. సైప్రస్ నుంచి ప్రధాని మోడీ నేరుగా కెనడాకు వెళ్తారు. ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు జూన్ 16-17న కననాస్కిస్‌లో జరగనున్న జీ-7 సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో ప్రధాని మోడీ పాల్గొనడం వరుసగా ఆరో సారి. ఇందులో భాగంగా జీ-7 దేశాధినేతలతో సమావేశం కానున్నారు. జీ-7 దేశాల్లోని అంతర్జాతీయ సంస్థల అధిపతులతో ఇంధన భద్రత, కీలక అంతర్జాతీయ సమస్యలు, సాంకేతికత, ఆవిష్కరణలపై చర్చలు జరపను న్నారు. తిరుగు ప్రయాణంలో భాగంగా జూన్ 18న మోడీ ఐరోపాలోని క్రొయేషి యాకు వెళ్లనున్నారు. ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.

# విదేశాంగ విధానం గందరగోళం

(మొదటి పేజీ తరువాయి)

ప్రవచనాలు పలికిన కేంద్రం ఆ వైఖరిని విడనాడిందా అని ప్రశ్నించింది. ఓటింగ్‌కు గైర్హాజరు కావాలన్న నిర్ణయంతో భారత్ ఒంటరి అయిందని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శించారు. విదేశాంగ మంత్రి జయశంకర్ పదే పదే చేస్తున్న తప్పులను ప్రధాని నరేంద్ర మోడీ సరిదిద్దాలని, జవాబుదారీతనంతో వ్యవహరించేలా చూడాలని ఖర్గే సూచించారు. 'గాజాలో కాల్పుల విరమణ పాటించాలంటూ ఐరాస ఆమోదించిన తీర్మానానికి 149 దేశాలు మద్దతు తెలిపాయి. 19 దేశాలు మాత్రమే ఓటింగుకు గైర్హాజరు కాగా వాటిలో భారత్ కూడా ఉంది. ఈ చర్యతో మనం ఒంటరిగా మిగిలి పోయాం' అని ఖర్గే చెప్పారు. ఇజ్రా యిల్ ప్రజలపై హమాస్ జరుపు తున్న దాడులను కూడా కాంగ్రెస్ ఖండిస్తోందని ఆయన గుర్తు చేశారు. అలీన సిద్ధాంతానికి, నైతిక దౌత్యానికి కట్టుబడి ఉండడం భారత్ దీర్ఘకాలిక వైఖరి అని తెలిపారు. కాగా దక్షిణా సియా, బ్రిక్స్, ఎస్‌సీఓలో ఐరాస తీర్మానంపై ఓటింగ్‌కు దూరంగా ఉన్న ఏకైక దేశం మనదేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. 'నెహ్రూ వారసత్వంపై వారికి గౌరవం ఎలాగూ లేదు. కానీ పాలస్తీనాపై వాజ్‌పేయి అవలంబిం చిన వైఖరికి ఎందుకు దూరంగా ఉన్నారు?' అని ప్రశ్నించారు. ఐరాస తీర్మానంపై ఓటింగుకు భారత్ గైర్హాజరు కావడం సిగ్గుచేటు, విచారకరమని ప్రియాంక గాంధీ అన్నారు.

# నేడు ఏసీబీ ఆఫీస్‌కు కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ విచారణ జనవరి 9వ తేదీన విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. నాడు దాదాపు ఆరున్నర గంటల పాటు కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు విచారించారు. తన లాయర్ రామచంద్రరావుతో కలిసి కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే.

# ఆస్పత్రిలో సోనియా గాంధీ

(మొదటి పేజీ తరువాయి)



బాధపడుతూ ఇక్కడి గ్యాస్ట్రో విభాగంలో చేరినట్టు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆమె వైద్యుల పరిశీలనలో ఉన్నట్టు తెలిపాయి. ఈ నెల 9న సోనియా ఇదే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దీనికి రెండు రోజుల ముందు శిమ్లాలోని ఇందిరాగాంధీ వైద్య కళాశాల ఆసుపత్రి (ఐజీఎంసీ)లో చేరిన విషయం తెలిసిందే. అధిక రక్తపోటుతో బాధపడుతున్న ఆమెకు వైద్యులు చికిత్స అందించారు.


## సంపాదకీయం


# తూర్పు ఆఫ్రికాలో ఇనుపపాము

తూర్పు ఆఫ్రికాలోని ప్రాంతాలను అనుసంధానించడానికి, కెన్యా నుంచి ఉగాండా వరకూ రైలు మార్గాన్ని నిర్మించాలని బ్రిటిష్ సామ్రాజ్య పాలకులు నిర్ణయించారు. చౌక శ్రమశక్తికి వెసులుబాటు కల్పించిన బానిసత్వ వ్యవస్థ అప్పటికే రద్దయ్యింది. దీంతో రైలు మార్గాన్ని నిర్మించడానికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన, తక్కువ ధరలో ఒప్పంద కార్మికులను భారతదేశం నుంచి తెచ్చుకోవచ్చు అనుకున్నారు తూర్పు ఆఫ్రికా వలస పాలకులు. దానికోసం 'ఇంపీరియల్ బ్రిటిష్ ఈస్ట్ ఆఫ్రికా కంపెనీ'ని 1888లో స్థాపించి, 1896లో మొంబాసా నుంచి విక్టోరియా సరస్సు దాకా రైల్వే ట్రాక్ నిర్మాణాన్ని ప్రారంభించారు. అవసరమైన కార్మికులు, సహాయక అధికారులను నియమించడానికి బాధ్యత వహించే ఒక ఏజెంట్‌ను కరాచీలో నియమించారు. ప్రధాన నియామక కేంద్రమైన లాహోర్‌లో ఒక బ్రాంచ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. భారతదేశంలో రైల్వే నిర్మాణాన్ని ప్రారంభించిన దాదాపు 40 సంవత్సరాల తరువాతనే, తూర్పు ఆఫ్రికాలో రైళ్ల నిర్మాణ ఆలోచన మొదలయింది. భారతదేశంలో అటువంటి నిర్మాణ పనుల్లో పనిచేసిన కార్మికుల మీద బ్రిటిష్ వారి దృష్టి పడింది. ఉచిత ప్రయాణం, ఉచిత భోజనం, జీతం, ఉచితంగా తిరుగు ప్రయాణం లాంటి జనాకర్షక హామీలతో, పంజాబ్‌లోని గ్రామాల నుంచి కేవలం మగ, యువకార్మికులను సమీకరించగలిగారు. బ్రిటిష్ ఇండియా స్టీమ్ నావిగేషన్ కంపెనీకి చెందిన ప్రత్యేక చార్టర్డ్ స్టీమర్లలో వారినందరినీ కరాచీకి పంపారు. అక్కడి నుంచి మొంబాసాకు దాదాపు 3వేల మైళ్లు, తొమ్మిది రోజుల ప్రయాణం. 1896 జనవరి 24న మొంబాసాలో 350 మంది పంజాబీల మొదటి జట్టుతో ఒప్పంద కార్మిక వ్యవస్థ అక్కడ ప్రారంభమైంది. 7,500 మంది నైపుణ్యం ఉన్న కార్మికులు, 20 వేల మంది నైపుణ్యం లేని కార్మికులు భారతదేశం నుంచి వెళ్లారు. మొత్తం మీద, రైల్వే నిర్మాణంలో 32 వేల మంది భారతీయులు ఉపాధి పొందారు. 1898లో రైల్వే నిర్మాణం 100 మైళ్ల దూరం వరకూ సాగింది. తీరం నుంచి 326 కి.మీ దూరంలో ఉన్న నైరోబీకి మే 1899లో చేరుకుంది. ఆ తరువాత అక్కడ అది కీలకమైన ఓడరేవు అయింది. అయితే 200 మైళ్ల ప్రయాణం తరువాత, రైల్వే నిర్మాణంలో అత్యంత భయంకరమైన అధ్యాయాలలో ఒకటి 1898లో త్సావో నది మీద వంతెన నిర్మాణ సమయంలో జరిగింది. నరమాంస భక్షక మగ సింహాల జత, కార్మికుల శిబిరాలకు చేరి, రాత్రిపూట గుడారాలలో నిద్రిస్తున్న కార్మికులను బయటకు లాగి భక్షించేవి. పది నెలల పాటు కొనసాగిన ఆ దాడిలో వందమందికి పైగా మరణించారు.వందలాది మంది కార్మికులు త్సావో నుంచి పారిపోవడంతో రైల్వే నిర్మాణం దాదాపు ఆగిపోయింది. ఆ సింహాలు కొంతకాలం తర్వాత, పనిలో ఉన్న పురుషులను వెంబడించడంలో నిపుణులయ్యాయి. సింహాలు అనుసరించిన పద్ధతులు అసాధారణమైనవి కావడంతో, ఆ రెండు మగ సింహాలూ కచ్చితంగా సింహాల శరీరంలోకి ప్రవేశించిన దెయ్యాలని భారతీయ కార్మికులు నమ్మడం మొదలుపెట్టారు. సింహాలను అంతం చేసే పని రైల్వే నిర్మాణాన్ని పర్యవేక్షించే ఇంజనీర్, లెఫ్టినెంట్ కల్నల్ జాన్ ప్యాటర్సన్ మీద పడింది. వారాల తరబడి నిరంతరాయంగా వెంబడించిన తర్వాత, ప్యాటర్సన్ ప్రాణాలకు తెగించి సింహాలను అంతం చేయగలిగాడు. వీటి నిర్మూలన ఆ రైల్వే చరిత్రలో ఒక భయంకరమైన అధ్యాయానికి ముగింపు పలికింది. 'దెయ్యం' 'చీకటి' అనే మారుపేరుతో వాటిని చెప్పుకునేవారు. రైలు నైరోబీ రైల్వే రిఫ్ట్ వ్యాలీ వైపు మళ్లిన తర్వాత ఆ ప్రాంతం మరీ ప్రమాదకరంగా మారింది. నిర్మాణం త్సావో నదికి చేరుకోకముందే, రైల్వే కార్మికుల మీద అక్కడి మాసాయి తెగ భయంకరంగా దాడి చేసింది. దానికి కారణం గతంలో (నవంబర్ 1895) ఇద్దరు మాసాయి గిరిజన బాలికల మీద అత్యాచారం జరగడమే. దానికి ప్రతిక్రియగా, మాసాయి తెగ దాదాపు ఆరు వందల మందికి పైగా రైల్వే కార్మికులను హతమార్చింది. మరొక ముఖ్యమైన ప్రతిబంధకం... అక్కడి సెత్సే దోమల కాటు. ఇవి కార్మికులలో నిద్ర జబ్బును సృష్టించేవి. క్లిష్టమైన భూభాగం కారణంగా చాలామంది మలేరియా, నల్ల జ్వరంతో మరణించారు. అనేక మరణాలకు అక్కడ ఏ వైద్య సదుపాయాలూ లేవు. పేలుడు పదార్థాలతో పని చేయడం వల్ల, వడదెబ్బల వల్ల, సొరంగాల తవ్వకాలలో కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వచ్చేది. విక్టోరియా సరస్సుకి దగ్గరగా రైలు మార్గం విస్తరించడంతో నిర్మాణ పనుల్లో ఆటంకాలు మరింత పెరిగాయి.కార్మికుల పరిస్థితి మరింత దిగజారింది. అయినా భారతీయ ఒప్పంద కార్మికుల అకుంఠిత కృషి కారణంగా రైల్వే అథారిటీ ఆరేడు సంవత్సరాల వ్యవధిలోనే నిర్మాణాన్ని పూర్తి చేయగలిగింది. 1899లో తీరం నుంచి నైరోబీ వరకు, 1900 నాటికి నకురు ప్రాంతం వరకూ రైల్వే పనులు పూర్తయి, 1901లో విక్టోరియా సరస్సు తీరంలో కిసుము ప్రాంతానికి రైల్వే అథారిటీ చేరుకుంది. మొంబాసా నుంచి కిసుము దాదాపు 560 మైళ్ల దూరంలో ఉంది. కిసుముకు చేరుకునే నాటికి దాదాపు 2,500 మంది మరణించారు. 1903 నాటికి విక్టోరియా సరస్సు వరకు రైలు మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేశారు. పూర్తిగా స్థానిక కార్మికులపై ఆధారపడి ఉంటే రైల్వే నిర్మాణం కనీసం ఇరవై సంవత్సరాలు పట్టేదని బ్రిటిష్ అధికారులే భావించారు. ఆ ప్రశంస, కీర్తి అక్కడి ఒప్పంద భారతీయ కార్మికులకే చెందుతాయి. రైల్వేను నిర్మించడానికి మొత్తం 31,983 మంది భారతీయ కార్మికులు పని చేశారు. 6,454 మంది వ్యక్తులు ట్రాక్‌లు వేయడం మూలంగా అశక్తులయారు. రైల్వే నిర్మాణం పూర్తయిన తర్వాత 6,724 మందిని వారి సంరక్షిత రాజ్యంలో పని చేసేందుకు తీసుకున్నారు. వీరిలో 2,000 మందిని మాత్రమే రైల్వే శాఖల్లో నియమించుకున్నారు. ఆఫ్రికా సమాజానికి ఆ రైల్వే అనేక విధాలుగా ఉపయోగపడింది. భారతీయ ఒప్పంద కార్మికులు పోషించిన పాత్రతో తరువాత ఆఫ్రికా సమాజంలో అనేక మార్పులొచ్చాయి. రైల్వే నిర్మాణానికి ప్రారంభ ఖర్చు 50 లక్షల డాలర్లుగా నిర్ణయించబడినా, దాని నిర్మాణానికి బ్రిటిష్ వారికి 90 లక్షల డాలర్ల వరకూ ఖర్చయింది. అది పార్లమెంటులోను, మీడియాలోను తీవ్ర ఆగ్రహాన్ని సృష్టించింది. నిర్మాణం ప్రారంభించకముందే, ఈ ఆలోచనను వ్యతిరేకించినవారు చాలా మంది ఉన్నారు. వీరిలో ఒకరైన హెన్రీ లాబౌచెర్ కామన్స్ సభలో బ్రిటిష్ విదేశాంగ మంత్రి జార్జ్ కర్జన్‌ను ఇలా ఆక్షేపించాడు: 'దీనికి ఎంత ఖర్చవుతుందో ఏ పదాలూ చెప్పలేవు/ దాని లక్ష్యం ఏమిటో ఏ మెదడూ ఊహించలేదు/ అది ఎక్కడి నుంచి మొదలవుతుందో ఎవరూ కనిపెట్టలేరు/ అది ఎక్కడికి వెళుతుందో ఎవరికీ తెలియదు... స్పష్టంగా అది ఒక ఉన్మాద లైను తప్ప మరొకటి కాదు' అని. ఉగాండా రైల్వేను లూనాటిక్ (ఉన్మాద/పిచ్చి) అనే పదంతో పేర్కొనడం అదే మొదటిసారి. 'లూనాటిక్ ఎక్స్‌ప్రెస్' అనే పదాన్ని చార్లెస్ మిల్లర్ 1971లో తన పుస్తకం 'ది లూనాటిక్ ఎక్స్‌ప్రెస్: యాన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇన్ ఇంపీరియలిజం'లో ఉపయోగించాడు.

# స్థానిక సంస్థల ఎన్నిల పోరుకు కాంగ్రెస్ సర్కారు కసరత్తు

## జులై లేదా ఆగస్టులో?



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

- నేడు మంత్రులతో సీఎం ప్రత్యేక సమావేశం
- మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ..తర్వాతనే సర్పంచ్ ఎన్నికలు
- రెండు దశల్లోనే పూర్తిచేసే యోచన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కష్టమే
- పార్టీగా ఆ సంఖ్యలో బీసీ అభ్యర్థులను నిలిపే యోచనలో కాంగ్రెస్
- బీజేపీ కోర్టులోకి రిజర్వేషన్ బంతి



**హైదరాబాద్ --జూన్ 15- ప్రజా స్వేచ్ఛ**
స్థానిక సంస్థల పోరుకు కాంగ్రెస్ సర్కారు సన్నద్ధమవుతున్నది. జులై చివర్లోగానీ, ఆగస్టు మొదట్లోగానీ నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నట్టు ప్రభుత్వ వర్గాల నుంచి లీకులు బయటకు వస్తున్నాయి. మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించబోతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఆ తర్వాతనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. సాధారణంగా జులై వ్యవసాయ పనుల సీజన్. రైతులంతా ఆ పనుల్లో బిజీగా ఉంటారు కాబట్టి ఒకటెండ్రు నెలలు సాగదీస్తే ఎలా ఉంటుందనే చర్చను కూడా కాంగ్రెస్‌లోని కొందరు లేవనెత్తుతున్నారు. అయినా, ముందుకే వెళ్లాలని సీఎం సహా పలువురు కీలక మంత్రులు అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అందులో ప్రధానంగా స్థానిక సంస్థలు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం, ఇతర సంక్షేమ పథకాలపైనా చర్చించే అవకాశముంది. అయితే, ప్రధానంగా స్థానిక పోరుపైనే చర్చ నడిచే సూచనలున్నాయి. ప్రభుత్వ నిర్ణయం తర్వాత కొద్ది రోజుల్లోనే ఎన్నికల సంఘం నుంచి నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయి. గతంలో సాధారణంగా మూడు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేవారు. కానీ, ఈసారి మాత్రం రెండు విడతల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించ బోతున్నట్టు తెలుస్తోంది. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనూ తొలుత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను నిర్వహించారు. అదే పద్ధతిని ఈసారి అమలు చేసేలా కాంగ్రెస్ సర్కారు కసరత్తు చేస్తున్నది. మొదట ఈ ఎన్నికలు నిర్వహిస్తే పార్టీకి మేలు జరుగుతుందని కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తున్నది. అందులో భాగంగానే ప్రజల మూడ్‌ను పసిగట్టేందుకు మంత్రులు కూడా అక్కడక్కడా స్థానిక పోరుపై ప్రస్తావిస్తున్నారు. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే నాటికి రైతు భరోసా నిధులను విడుదల చేయాలనే యోచనలో రాష్ట్ర సర్కారు ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ సర్కారు చేస్తున్న పనులను ప్రజలకు విడమర్చి చెప్పేందుకు ప్రజల్లోనే ఎమ్మెల్యేలు, మంత్రులుం టున్నారు. మంత్రులు కూడా తమ ప్రోగ్రెస్ రిపోర్టులను విడుదల చేస్తున్నారు.

**42 శాతం చట్టబద్ధంగా కష్టమే..పార్టీగా ఇచ్చేందుకు మొగ్గు**

అయితే, బీసీలకు ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు కష్టమేననే అభిప్రాయానికి రాష్ట్ర సర్కారు వచ్చినట్టు తెలిసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర సర్కారు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రం కోర్టులోకి బంతి విసిరింది. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణనను కూడా చేస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే అది చట్టరూపం దాల్చాల్సిందే. ఇప్పట్లో అది సాధ్యమయ్యేటట్టు లేదు. కాంగ్రెస్ పార్టీ జిల్లాల ప్రాతిపదికన 42 శాతం మంది బీసీ అభ్యర్థులకు జెడ్పీటీసీ, ఎంపీటీల స్థానాలను ఇవ్వాలని భావిస్తున్నది. అదే సమయంలో బీజేపీ వల్లనే స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వలేకపోయామనే వాణిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ఆలోచనలో రాష్ట్ర సర్కారు ఉంది.

# బడికి దూరంగా 27 కోట్ల మంది చిన్నారులు

## గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ నివేదిక



**న్యూఢిల్లీ --జూన్ 15- ప్రజా స్వేచ్ఛ**
ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో దాదాపు 27.2 కోట్ల మంది చిన్నారులు బడికి దూరంగా ఉన్నారు. యునెస్కో యొక్క గ్లోబల్ ఎడ్యుకేషన్ మానటరింగ్ టీం (జీఈఎం) ఈ మేరకు అంచనా వేసింది. గత ఏడాది వేసిన అంచనా కంటే ఇది 2.1 కోట్ల మంది ఎక్కువ కావడం గమనార్హం. బడికి దూరంగా ఉన్న చిన్నారుల సంఖ్య భారీగా పెరగడంపై నివేదిక రెండు కారణాలను ముఖ్యంగా పేర్కొంది. ఒకటి నూతన నమోదు, హాజరు డేటాను పరిగణనలోకి తీసుకోవడం, రెండోవది ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ల ప్రభుత్వం అక్కడి బాలికల విద్యపై నిషేధం విధించడం. ఐరాస నియమాల ప్రకారం ఆరు నుంచి 17 ఏండ్ల వయస్సు కలిగినవారిని బడికి వెళ్లే వయస్సు వారుగా వర్గీకరిస్తారు. ఐరాస నవీకరించిన జనాభా అంచనాలు కారణంగా ఈ చిన్నారుల సంఖ్య భారీగా పెరిగిందని నివేదిక తెలిపింది. అలాగే, తాము వెల్లడించిన సంఖ్య కంటే బడికి దూరంగా ఉంటే చిన్నారుల సంఖ్య ఇంకా అధికంగా ఉండే అవకాశం లేకపోలేదని తెలిపింది. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సంఘర్షణల వాతావరణం నెలకుందని, ఇలాంటి వాతావరణం కారణంగా వాస్తవమైన డేటా సేకరణకు అంతరాయం కలుగు తుందని నివేదిక పేర్కొంది. అలాగే బడికి బయట ఉన్న చిన్నారులపై సంఘ ర్షణల వాతావారణం ప్రభావాన్ని తక్కువగా అంచనా వేస్తున్నారని తెలిపింది. ఏదేమైనా సరే ప్రపంచవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాల వయస్సు పిల్లల్లో 11 శాతం (దాదాపు 7.8 కోట్లు మంది), లోయర్ సెకండరీ పాఠశాల వయస్సు చిన్నారుల్లో 15 శాత మంది (6.4 కోట్లు), ఉన్నత పాఠశాల వయస్సు చిన్నారుల్లో 31 శాతం (దాదాపు 13 కోట్ల మంది) చిన్నారులు బడికి దూరంగా ఉన్నారని నివేదిక తెలిపింది. వివిధ దేశాలు తమ జాతీయ లక్ష్యాలను సాధిం చడంలో విఫలమైతే ఈ సంఖ్య పెరుగుదల కొనసాగుతూనే ఉంటుందని, ఒకవేళ దేశాలు తమ లక్ష్యాలను సాధించగలిగితే 2030 నాటికి బడికి దూరంగా ఉన్న చిన్నారుల సంఖ్యను 16.5 కోట్లకు తగ్గించవచ్చునని నివేదిక పేర్కొంది.

# సిద్దిపేట కలెక్టర్ గా కే.హైమావతి బాధ్యతల స్వీకరణ..!!





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ...
సిద్దిపేట ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను జిల్లాలోని ప్రజలకు సమర్ధవంతంగా అందించడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తానని నూతనంగా జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన కే.హైమావతి తెలిపారు.శనివారం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ చాంబర్ లో వేదపండితుల ఆశీర్వచనం తీసుకొని జిల్లా కలెక్టర్ గా కే.హైమావతి బాధ్యతలు స్వీకరించారు. నూతన కలెక్టర్ కు జిల్లా అదనపు కలెక్టర్లు గరీమ అగర్వాల్, అబ్దుల్ హమీద్, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కే.హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలే తన ప్రాధాన్యత కార్యక్రమాలని వాటిని జిల్లా ప్రజలకు సమర్ధవంతంగా అందించడమే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మినీ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ఆయా శాఖల జిల్లా అధికారులను పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యంగా విధులు నిర్వహించాలని సూచించారు. అదే విధంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బదిలీ పై వెళ్లిన జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ హైమావతికి పులబోకే అందించారు.

# ఆహారపు అలవాట్లు మార్చుకోండి,వ్యాయామం చెయ్యండి ఆయుః ప్రమాణం పెంచుకోండి

**-ప్రముఖ నరాల వైద్యులు గోపాలం శివన్నారాయణ**

మిర్యాలగూడ ,ప్రజా స్వేచ్ఛ...
మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లలో మార్చుకొని, ప్రతీ రోజు ఒక గంట వ్యాయామం, శరీరక శ్రమ చేయడం, చిన్న చిన్న పనులకు బైక్ లు వాడకుండా నడక మార్గాన వెళ్లాలని, ఆహారాన్ని మితంగా తీసుకోవాలని, వైద్యుని సలహా మేరకు మందులను వాడాలని తద్వారా జీవన ప్రమాణాన్ని పెంచుకోవచ్చని ప్రముఖ నరాల వైద్యులు గోపాలం శివన్నారాయణ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ హౌసింగ్ బోర్డు కాలనీ లోని నవ జ్యోతి ఇంగ్లిష్ మీడియం పాఠశాల నందు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిభిరంలో పాల్గొని పక్షవాతం, పిట్స్, బీపి, షుగర్ రోగులకు 260 మందికి పరీక్షించి, దాతలు అభ్యాస్ స్కూల్ అధినేత వంగాల నిరంజన్ రెడ్డి, శాస్త్రావేత్త బంటు భాస్కర్, సాఫ్ట్వేర్ ఇంజనీర్ రెహానా అలీ దాతృత్వంతో 260 మంది రోగులకు 4 నెలలకు సరిపడా మందులను




అందజేశారు. నిర్వాహకులు కోలా శ్రీనివాస్, పాదురి రమణా రెడ్డి, మాట్లాడుతూ నిరుపేద రోగుల కొరకు నిర్వహించబడుతున్న ఇట్టి ఆరోగ్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇటువంటి శిభిరానికి దాతలు చేయుతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోమలి, రిటైర్డ్ ఎస్బిఐ డీజీఎం సైదిరెడ్డి, జన విజ్ఞాన వేదిక నల్లగొండ జిల్లా అధ్యక్షులు గుత్తికొండ సుదర్శన్ రెడ్డి, పారెపల్లి సత్యనారాయణ రావు, శోభారాణి, సురేష్ కుమార్, మోర్తల శ్రీనివాస్ రెడ్డి, నక్క శ్రీనివాస్, వెంకట రమణా రెడ్డి,సత్యనారాయణ, మట్టారెడ్డి, ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రైవేటు కన్వేయన్స్ డ్రైవర్లకు చట్టబద్ధమైన,ఉద్యోగ భద్రత కల్పించాలి

**-ఏఐటీయూసీ డిమాండ్**

భద్రాద్రి కొత్తగూడెం,ప్రజా స్వేచ్ఛ
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (కొత్తగూడెం) సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేటు కన్వేయన్స్ డ్రైవర్లకు చట్టబద్ధంగా హక్కులు కల్పించాలని, చట్టబద్ధంగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, చేస్తున్న పని ఆధారంగా వేతనాలను లెక్క కట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే.డబ్ల్యూ. క్రిస్టఫర్ డిమాండ్ చేశారు.ఆదివారం నాడు కొత్తగూడెం కార్పొరేట్ లో పనిచేస్తున్న ప్రైవేటు కన్వేయన్స్ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో జీవో ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నట్లుగా లెక్కలలో చూపించి, వాస్తవంగా పూర్తి వేతనాలు డ్రైవర్లకు చెల్లించడం లేదని ఆరోపించారు. దీని



మూలంగా ఒక్కొక్క డ్రైవరు నెలకు రూ. 5 వేల నుంచి రూ. 6 వేల దాకా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతినెలా ఏడవ తేదీ లోపు అందాల్సిన జీతాలు 15వ తేదీ తర్వాతనే యజమానులు చెల్లిస్తున్నారని, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత లేక తీవ్ర అభద్రతా భావంలో ఆందోళన చెందుతున్నారని అన్నారు. సింగరేణి యాజమాన్యం (సీఎంపీఎఫ్) కింద 15% అడహక్ పేమెంట్ పేరుతో కట్ చేసిన డబ్బుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. గత మూడు సంవత్సరాల నుండి కటింగ్ అయిన సీఎంపీఎఫ్ డబ్బుల లెక్కలు ఇంతవరకు డ్రైవర్లకు చూపించకపోవడంతో ఆందోళన చెందుతున్నారని విమర్శించారు.ప్రైవేటు కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ దశల వారీ పోరాటాలకు సిద్ధమవుతుందని, డ్రైవర్లందరూ ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె. మధు, ఇ. ప్రవీణ్, ఏ. లక్ష్మీనారాయణ, ధనరాజ్, రంజిత్, యూసఫ్, విష్ణు, భవాని ప్రసాద్, వంశీ, బాలకృష్ణ, సి.హెచ్. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేద్దాం ప్రాణదాతగా నిలుద్దాం!

**స్పందించిన యువతకు అభినందనలు**

**డాక్టర్ టి సురేందర్ సేవ్ ఎర్త్ ఫౌండేషన్**

హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ...
ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వనస్థలిపురం నేటి యువతరానికి ఆదర్శవంతంగా ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ సేవ్ ఎర్త్ ఫౌండేషన్ లో వాలంటీర్ గా సేవలందిస్తున్న యు. ఉస్సేన్ నేడు ఫాదర్స్ డే,11వ సారి రక్తదానం చేసి నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా



రికార్డు స్థాయిలో 322మార్లు రక్తదానం చేసిన డాక్టర్ సంపత్ కుమార్, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు స్వదేశీ భూషణ్, డాక్టర్ సురేందర్ ఉస్సేన్ కు అదేవిధంగా శివకుమార్ కు అభినందనలు తెలిజేస్తూ సర్టిఫికెట్ జ్ఞాపికను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నక్క స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు నక్క శ్రీనివాస్ యాదవ్, స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షుడు సంజయ్ కుమార్, జల్లా శ్రీనివాస్, పవన్ కుమార్ మంబరాస్, బాలకిషన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటింటికి చేరాలి

**యువజన కాంగ్రెస్ బాధ్యతగా తీసుకోవాలి**

**దేవరకొండ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాకేష్**

చింతపల్లి, ప్రజా స్వేచ్ఛ...
దేవరకొండ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు, యువకులు మన ఎమ్మెల్యే బాలు నాయక్ నాయకత్వంలో జరిగిన గ్రామాల అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం చేపట్టిన కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ నేరుగా తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని, దేవరకొండ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రాకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా చింతకుంట్ల రాకేష్



మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఆరోగ్య భద్రత, విద్యా సహాయం, ఇళ్ల నిర్మాణం, సన్నబియ్యం,రైతు పథకాలు వంటి అంశాలను ప్రజలకు వివరించడం యువజన కాంగ్రెస్ ప్రధాన బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రజల మధ్య నమ్మకాన్ని పెంచడం ద్వారా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతన దిశగా అడుగులు వేయాలి" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా యువజన నాయకులు సంఘటితంగా కృషి చేయాలని, ప్రతి కార్యకర్త గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి వేదిక కావాలని ఆయన సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్ల పత్రాల పంపిణీ



జగిత్యాల ప్రజా స్వేచ్ఛ...
ఇబ్రహీంపట్నం మండలంలోని యామపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ ఇండ్లు నిలుస్తాయని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పదేళ్లు గడిచినా ఈ పథకం కింద అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయలేకపోయారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలల్లోనే అర్హులైన వారికి ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తోందని, ప్రతి మండలంలో ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించామని వివరించారు. మొదటగా ఇల్లు పూర్తి చేసే లబ్ధిదారుడికి రూ.10,116 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు శ్రమిస్తోందని, సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని చెప్పారు.ఇంటి నిర్మాణాలు త్వరితగతిన.చేపట్టాలని లబ్ధిదారులను కోరారు. రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ, కొత్త కార్డుల మంజూరు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి, SC సెల్ అధ్యక్షుడు దూదిగం గంగారం, మహిళా మండలి అధ్యక్షురాలు లక్కడి నర్సవ్వ, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూస రాజేశ్వర్ మాజీ ఎంపీపీ దేవేందర్, భాస్కర్ రెడ్డి, బండి రాజేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా పార్క్ ధర్నాను జయప్రదం చెయ్యండి.

**అఖిలపక్ష నాయకుల పిలుపు.**




**కూకట్పల్లి ,ప్రజా స్వేచ్ఛ...**
ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా తేదీ 17జూన్ నాడు నిర్వహించే ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చెయ్యాలని నేడు షాపూర్ నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో వామపక్ష పార్టీల నాయకులు గోడపత్రికను విడుదల చెయ్యడం జరిగింది.సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్,జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,సిపిఎం మండల కార్యదర్శి లక్ష్మణ్,సిపిఐ ఎమ్ ఎల్ నాయకులు అనురాధ,శివబాబు, మాస్ లైన్ కార్యదర్శి ప్రవీణ్,సిపిఎం నాయకులు అంజయ్య,సత్యం, స్వాతి లు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మావోయిస్టు లను ఏరివేత పేరుతో చంపుతాం అని బహిరంగాగా ప్రకటించడం రాజ్యాంగం కల్పించిన మనిషి జీవించే హక్కును కాలరాయడమే నని,చర్చలు జరుపడానికి సిద్ధం అని ప్రకటించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమాని,ఇతర దేశాలతో చర్చలు జరుపడానికి సిద్ధమైన ప్రభుత్వం,స్వంత పౌరులతో చర్చలు జరపకపోవడం బీజేపీ దుర్నితిని తెలియచేస్తుందని, ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టు లను అంతం అనే పేరుతో ఖనిజాలను అడవులను కార్పొరేట్ సంస్థలకు ధరదత్తం చెయ్యడేమనని పర్యావరనం ను కాపాడుకోవాలంటే ఆపరేషన్ కాగార్ ను ఆపాల్సిందే నని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావడానికి ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలాని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నర్సింహారెడ్డి,వంశీ, జంబూ,లక్ష్మి,సిపిఎం నాయకులు శ్రీను,కరుణాకర్, ఎమ్ డి బాషా తదితరులు పాల్గొన్నారు.

# గురువే జ్ఞాన దీపం తల్లిదండ్రులే దేవుళ్ళు

**– సిద్దేశ్వరానందగిరి మహారాజ్**

**– వేద పాఠశాల విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు**

**– హాజరైన పలు రాష్ట్రాల విద్యార్థులు, తల్లిదండ్రులు**





**జహీరాబాద్, ప్రజా స్వేచ్ఛ...**
ఝరాసంగం : గురువు లేనిదే విద్య లేదు. విద్య లేనిదే జ్ఞానం లేదు. అందుకే గురువే జ్ఞాన దీపమని, జన్మనిచ్చి తల్లిదండ్రులే ప్రత్యక్ష దేవుళ్ళు అయితే మనల్ని గురువులు విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి వారు చేస్తున్న కృషి వెలగట్టలేనిదని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ 1008 మహామండలేశ్వర్ డాక్టర్. మహంత్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ అన్నారు. ఆదివారం దత్తగిరి మహారాజ్ వైదిక పాఠశాల 2025 సంవత్సరానికి మొదటి విడతగా ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ప్రాంతాలకు చెందిన సుమారు 96 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వారికి ఆశ్రమ పీఠాధిపతి, అర్చకులు, ఉపాధ్యాయులు మౌఖిక పరీక్ష నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. రెండవ విడత పరీక్ష ఉంటుందని త్వరలోనే తేదీని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తెలియజేస్తామన్నారు.మొదటి విడతగా పరీక్షలు రాసిన విద్యార్థుల జాబితాను విద్యార్థుల తల్లిదండ్రులకు త్వరలోనే తెలియజేస్తామన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడిగా మారింది.

# తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు





**జన్మదినాన్ని పురస్కరించుకొని తడక జగదీశ్వర్ గుప్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం**

**గ్రేటర్ హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**
వైఎస్ఆర్సీపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు,మరియు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్గుప్తా ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి దగ్గర ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుట్టినరోజు పురష్కరించుకుని సుమారు వెయ్యి మంది నిరుపేదలు, అన్నార్తులు,అభాగ్యులకు చికెన్ బిర్యాని అన్నదానం చేసినట్లు జగదీశ్వర్గుప్తా తెలిపారు గౌరవనీయులు భట్టి విక్రమార్క మరి ఎన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆ దేవదేవుడు శ్రీ వెంకటేశ్వర స్వామి కరుణ కటాక్షాలు ఉండాలని అన్ని విధాల అష్టైశ్వర్యాలు రాజకీయ పదవులు రావాలని గుప్త కోరుకున్నారు గౌరవనీయులు భట్టి విక్రమార్క మా ఆర్యవైశ్య సంఘమునకు ఎక్కడ ఆపద వచ్చిన ముందు ఉంటాడని అన్ని సంఘాల వారికి న్యాయం చేసి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయమునకు వచ్చి సంఘం సభ్యులందరినీ ధైర్యం చెప్పి అన్ని విధాల సహాయ సహకారాలు అందించారు భట్టి విక్రమార్క ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి శిష్యుడుగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు అన్ని కార్యక్రమాలకు ఆర్థిక సహాయాలు చేసి సేవా కార్యక్రమాలలో ముందుంటాడని గుప్తా తెలిపారు కావున మరి ఎన్నో పదవులు రావాలని ఆ భగవంతుడు ఆ కుటుంబానికి అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు కలిగించాలని ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు గుప్తా తెలిపారు

## ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మ దిన వేడుకలలో యలమంచి ఉదయ్ కిరణ్ బృందం



**శేరిలింగంపల్లి,ప్రజా స్వేచ్ఛ...**
తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టినరోజు సందర్భంగా మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ మరియు యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు యలమంచి ఉదయ్ కిరణ్ తన బృంద సభ్యులతో కలిసి ప్రజాభవన్ లో వారి జన్మదిన సందర్భంగా కలిసి భట్టి విక్రమార్క కి పుష్పగుచ్చం సమర్పించి, శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సంక్షేమ పట్ల భట్టి విక్రమార్క చూపుతున్న నిబద్ధత, శ్రమ, వినమ్రత ప్రజల్లో ఎంతో ప్రేరణనిస్తుంది అని యలమంచి ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శరత్, కృష్ణ, వంశీ, నాగచారి, నాగ సాయి, దిలీప్, గోపీ, రాజు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూభట్టి విక్రమార్క ప్రజల పట్ల అపారమైన మమకారంతో, నిబద్ధతతో పనిచేస్తున్నారు. ఆయన్నిలా ప్రజల అభివృద్ధికి పాటుపడే నాయకుడిగా చూడటం గర్వకారణం. ఆయనకు ఆయురారోగ్యాలతో పాటు మరిన్ని విజయాలు కలగాలని మనసారా కోరుకుంటున్నాం" అని తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి.

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.**



**మెదక్ జిల్లా:ప్రజా స్వేచ్ఛ**
జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో సంస్థాగత ప్రసవాలను పెంచేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.ఆదివారం మెదక్ జిల్లా కలెక్టర్ కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు.దవాఖానలో సిబ్బంది స్టాక్ రిజిస్టర్, మందులు నిల్వల రిజిస్టర్, ఓ.పి రిజిస్టర్ను పరిశీలించి. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ ఆసుపత్రులలో సంస్థాగత, సాధారణ ప్రసవాలు , ఆరోగ్య మహిళా కార్యక్రమం,గురించి ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖచ్చితంగా డెలివరీల సంఖ్యను పెంచాలన్నారు. రిస్క్ ఉన్న కేసులను జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి లకు పంపాలని చెప్పారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా గుర్తించిన అనుమానిత క్యాన్సర్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వారిని జిల్లా ఆసుపత్రి కి రిఫరల్ చేస్తూ ఖచ్చితంగా పరీక్షలు చేసుకునేలా మానిటర్ చేయాలన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమం తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో చేపట్టాలన్నారు. జ్వర బాధితులకు టెస్ట్ ల సంఖ్యను పెంచాలన్నారు.డెంగ్యూ,మలేరియా, టైఫాయిడ్ కేసుల ను పూర్తిగా అరికట్టేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. హై రిస్క్ ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు డ్రైడేను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు ప్రధానంగా నీటి నిల్వ లేకుండా జాగ్రత్త పడాలన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## టేబుల్ టెన్నీస్ విజేతలకు బహుమతులు ప్రధానం



**తార్నాక:ప్రజా స్వేచ్ఛ :**
ద వెటరన్ టేబుల్ టెన్నీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి ప్రొ జయశంకర్ ఇండోర్ స్టేడియంలో మూడవ తెలంగాణ స్టేట్ టేబుల్ టెన్నీస్ టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నారు. వివిద 6 కేటగిరీలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఐఎసిసిఎస్ చైర్మెన్ నవీన్ కుమార్, అసోసియేషన్ అధ్యక్షులు దయాకర్ కుసుమ, ప్రధాన కార్యదర్శి విఠల్ భేతి ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, దేవేంద్రనాథ్, రంగారావు, గోపినాథ్రావు, లలిత్ మోహన్, రామారావు, సురేష్, రాజేంద్రప్రసాద్, హరికృష్ణ, పి. సురేష్ తదితరులున్నారు.

# ఈ రోజు రైతు నేస్తం రాష్ట్ర ముఖ్య మంత్రి వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి రైతులతో ముఖాముఖి.

**మెదక్ జిల్లా-ప్రజా స్వేచ్ఛ**
రైతునేస్తం కార్యక్రమం లో భాగంగా16వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం నుంచి వివిధ జిల్లాల రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. ఈ రోజు మధ్యాహ్నం 03 గంటలకు జరగనున్న ఈ ముఖాముఖి కార్యక్రమం. రాష్ట్రవ్యాప్తంగా గల రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారమవుతుందని,ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం క్షేత్రస్థాయిలో హవేలి ఘనపూర్ మండలం రైతు వేదికలో ఏర్పాట్లను



పరిశీలించారు.రైతు నేస్తం కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 36 రైతు వేదికలలో కొత్తగా ప్రారంభం అవ్వనున్న దృశ్య శ్రవణ మాధ్యమాలతో పాటుగా ఇంతకముందే ప్రారంభమైనటువంటి దృశ్య శ్రవణ మాధ్యమాలు గల21 రైతు వేదికలతో కలిపి మొత్తంగా 57 రైతు వేదికల నందు సీఎం రైతులతో ముచ్చటించ నున్నారని వివరించారు.

# తగ్గేదేలే.. లక్ష మార్క్ దాటి భారీగా పెరిగిన బంగారం ధరలు..

## తెలుగు రాష్ట్రాల్లో రేట్లు ఎలా ఉన్నాయంటే..

బంగారానికి మళ్లీ రెక్కలు వచ్చేశాయి. ఇరాన్ – ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పెట్టుబడులకు సేఫ్ అయిన బంగారం వైపు ఇన్వెస్టర్లు చూస్తున్నారు. దీంతో బంగారం ధర మళ్లీ లక్ష మార్కు దాటింది. రెండు నెలల క్రితం లక్ష మార్కు దాటిన పసిడి ధరలు తగ్గినట్లే తగ్గి.. మళ్లీ లక్ష దాటి పరుగులు పెడుతున్నాయి.. వాస్తవానికి పసిడి, వెండికి ఎల్లప్పుడూ డిమాండే ఉంటుంది.. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కోసారి తగ్గితే.. మరికొన్ని సార్లు పెరుగుతూ వస్తుంటాయి.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయడంతో మిడిల్ ఈస్ట్‌లో టెన్షన్లు పెరిగాయి. దీనికి తోడు US ట్రేడ్ పాలసీలో అనిశ్చితి, ట్రంప్ టారిఫ్స్ బెదిరింపులు, US ద్రవ్యోల్బణం,. దాంతో US బాండ్లలో కంటే గోల్డ్‌లో ఇన్వెస్ట్ చేయడానికి ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారు. అమెరికా అప్పులపై ఆందోళనలు, ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు వల్ల కామెక్స్‌లో గోల్డ్ ఒక్క రాత్రిలో ఔన్స్‌కు 50 డాలర్లు



పెరిగింది. బంగారానికి భారీ డిమాండ్ కనిపిస్తోంది.. జూన్ 15 2025 ఆదివారం ఉదయం వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర 1,01,680 ఉండగా.. 22 క్యారెట్ల ధర 93,200 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,10,000లుగా ఉంది.

### ప్రముఖ నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,01,680 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.93,200 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,20,000లుగా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,680 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.93,200లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,20,000 లుగా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,830, 22 క్యారెట్ల ధర రూ.93,350 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,10,000లుగా ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.1,01,680, 22 క్యారెట్ల ధర రూ.93,200 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,10,000లుగా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,01,680 లు ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.93,200 లుగా ఉంది. వెండి ధర కిలో రూ.1,20,000 లుగా ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,01,680, 22 క్యారెట్ల ధర రూ.93,200 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,10,000 లుగా ఉంది.

# బిజినెస్

## పేరుకుపోయిన కార్ల నిల్వలు

### డీలర్ల వద్ద రూ.52 వేల కోట్ల ఇన్వెంటరీస్



**న్యూఢిల్లీ**

దేశంలో కార్ల అమ్మకాలు పడిపోయాయి. భారీగా పెంచిన ధరలకు తోడు, డిమాండ్ పడిపోవడంతో ఈ ఏడాది మే ముగింపు నాటికి దేశవ్యాప్తంగా డీలర్ల వద్ద రూ.51,000–52,000 కోట్ల విలువైన కార్ల నిల్వలు పెరుకుపోయాయి. ఆటోమొబైల్ సంస్థలు రోజుకో కొత్త మోడల్‌తో ఇబ్బడిముబ్బడిగా ఉత్పత్తి చేసి మార్కెట్లోకి విడుదల చేయడం కూడా నిల్వలు పెరగడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. 2024 దీపావళి సమయంలో ఇన్వెంటరీ స్టాక్ 40 నుంచి 45 రోజులు ఉండగా.. గడిచిన మేలో ఇది 34–38 రోజులకు తగ్గినప్పటికీ విలువ పరంగా చూస్తే మాత్రం భారీగా పెరిగిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది మేలో 3,02,214 కార్లు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో విక్రయించిన వాటితో పోల్చితే 3.14 శాతం తగ్గాయి. గడిచిన ఏడాది ఆటోమొబైల్ కంపెనీలు 10 శాతం మేర ధరలను పెంచాయి. ఉత్పత్తి వ్యయం పెరగడంతో పాటు డాలర్‌తో రూపాయి మారకం విలువ ఎక్స్చేంజీ రేట్ల కారణంగా చూపించి ధరలు పెంచాల్సి వస్తుందంటున్నారు. ఇన్వెంటరీ స్థాయి గరిష్ఠ స్థాయికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తుందని.. ప్రస్తుతం ఇది 52–53 రోజుల స్థాయిలో ఉందని ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ సమాఖ్య(ఫాడా) పేర్కొంది. దీంతో డీలర్ల నిర్వహణ ఖర్చులు అధికమై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపింది.

# ఐటీసీ చేతికి శ్రేష్ట నేచురల్

**న్యూఢిల్లీ,**

పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న ఐటీసీ.. 24 మంత్రా ఆర్గానిక్ బ్రాండ్‌కు చెందిన శ్రేష్ట నేచురల్ బయోప్రొడక్ట్‌ను హస్తగతం చేసుకున్నది. పూర్తిగా నగదు రూపంలో జరిగిన ఈ ఒప్పందం విలువ రూ.472.50 కోట్లుగా నిర్ణయించింది. అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న ఆర్గానిక్ ఫుడ్ ప్రొడక్ట్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం ఐటీసీకి దన్నుగా నిలువనున్నది. ఎస్ఎన్‌బీపీఎల్‌లో 100 శాతం వాటాను శుక్రవారం కొనుగోలు




చేసినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం ఇచ్చింది. భారత్‌తోపాటు విదేశాల్లో ఆర్గానిక్ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రెండు నెలల క్రితమే శ్రేష్టలో మెజార్టీ వాటాను కొనుగోలు చేస్తున్నట్లు ఐటీసీ ప్రకటించింది. దీనికి అనుగుణంగా ఈ వాటాను 100 శాతానికి పెంచుకున్నది. ప్రస్తుతం ఎస్ఎన్‌బీపీఎల్..100 రకాల ఆర్గానిక్ ఉత్పత్తులు, బ్రాండెడ్ కిరాణా సామాగ్రి, సుగంధ ద్రవ్యాలు, మసాల దినుసులు, వంటనూనెలు, పానీయాలు, ఇతర వస్తువులను విక్రయిస్తున్నది. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను శ్రేష్ట రూ.306.1 కోట్ల ఆదాయాన్ని గడించింది. 27 వేల మంది రైతులు, 1.4 లక్షల ఎకరాల సర్టిఫైడ్ ఆర్గానిక్ భూమి, 10 రాష్ట్రాల్లో 71 క్లస్టర్లను కలిగివున్నది సంస్థ.

# డబ్ల్యూటీసీలో కమిన్స్, బుమ్రా హవా..
# అత్యధిక వికెట్ల వీరులు వీళ్లే..!

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో కొత్త ఛాంపియన్ అవతరించింది. 27 ఏళ్ల కలకు రూపమిస్తూ దక్షిణాఫ్రికా తొలిసారి ఐసీసీ టోర్నీ విజేతగా ఆవిర్భవించింది. లార్డ్స్‌లో తెంబ బవుమా సారథ్యంలోని సఫారీ జట్టు కొత్త చరిత్ర సృష్టిస్తూ టెస్టు గద ను అందుకుంది. దాంతో, వరుసగా రెండోసారి విజేతగా నిలవాలనుకున్న కంగారూలకు నిరాశే మిగిలింది. అయితే.. రెండేళ్లుగా ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఈ సీజన్‌లో పేసర్ల హవా కొనసాగింది. వీళ్లలో ఆసీస్ స్పీడ్‌స్టర్లు ఇద్దరూ అత్యధిక వికెట్ల వీరుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. డబ్ల్యూటీసీ 2023–25 సైకిల్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అత్యధిక వికెట్లు పడగొట్టాడు. లార్డ్స్‌లో సఫారీలతో జరిగిన ఫైనల్లో నిప్పులు చెరిగిన ప్యాటీ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు.. రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ సాధించాడు. దాంతో, ఈ సైకిల్‌లో అతడి పేరిట 80




వికెట్లు ఉన్నాయి. ఆసీస్ సారథి 18 మ్యాచుల్లోనే 80 వికెట్లు పడగొట్టగాడు. భారత జట్టు ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ యార్కర్ కింగ్ 15 మ్యాచుల్లోనే 77 వికెట్లు తీశాడు.

### అశ్విన్ ఐదో స్థానంలో..

డబ్ల్యూటీసీ ఫైనల్లో అర్ధ శతకంతో ఆసీస్ ఆధిక్యాన్ని 280కి పెంచిన మిచెల్ స్టార్క్ కూడా 70కి పైగా వికెట్లు తీశాడు. యార్కర్లతో బ్యాటర్లను హడలెత్తించే అతడి ఖాతాలో కూడా 77 వికెట్లు ఉన్నాయి. అయితే.. బుమ్రా కంటే 5 మ్యాచులు.. అంటే ఈ స్పీడ్‌స్టర్ 19 మ్యాచులు తీసుకున్నాడు. కంగారూ స్పిన్నర్ నాథన్ లియాన్ 7 టెస్టుల్లో 66 వికెట్లతో నాలుగో స్థానంలో నిలవగా మాజీ స్పిన్నర్ అశ్విన్ ఐదో స్థానంలో ఉన్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మధ్యలోనే టెస్టులకు వీడ్కోలు పలికిన యశ్.. 14 టెస్టుల్లో 63 వికెట్లు పడగొట్టాడు.

# సర్ఫరాజ్ ఖాన్ మెరుపు సెంచరీ..
# తేలిపోయిన బుమ్రా..!

ఇంగ్లండ్ పర్యటనకు ముందు సన్నాహక పోరులో భారత ప్రధాన పేసర్ బుమ్రా దారుణంగా విఫలమయ్యాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అయితే.. టాపార్డర్ బ్యాటర్లు మాత్రం దంచేశారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ అర్ధ శతకాలతో ఫామ్ చాటుకున్నారు. ఇండియా ఏ కు ఆడుతున్న సర్ఫరాజ్ ఖాన్ విధ్వంసక శతకంతో మెరిశాడు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేయలేదన్న కసితో కాబోలు మెరుపు సెంచరీ బాదాడు. 76 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లతో సెంచరీ పూర్తి చేసుకున్నాడీ చిచ్చరపిడుగు. దాంతో ఇండియా ఏ రెండో రోజు ఆట ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. అయితే.. ప్రధాన



జట్టు కంటే 160 పరుగుల వెనకబడే ఉంది.

### పటాపంచలు చేస్తూ..

బెకెన్‌హమ్‌లోని కౌంటీ క్రికెట్ మైదానంలో భారత జట్లు ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడుతున్నాయి. ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనధికారిక టెస్టులు ఆడిన భారత ఏ జట్టుతో శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని సీనియర్ జట్టు తలపడిన ఈ పోరులో.. సర్ఫరాజ్ ఖాన్ సెంచరీతో తన తడాఖా చూపించాడు. 101 పరుగులతో జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై ఆడలేదు అనే సందేహాన్ని పటాపంచలు చేసిన సర్ఫరాజ్ సెలెక్టర్లకు సవాల్ విసిరాడు. నిరుడు స్వదేశంలో ఇంగ్లండ్ మీదే అరంగేట్రం చేసిన ఈ రంజీ హీరో.. బెంగళూరులో న్యూజిలాండ్‌పై 150 పరుగులతో చెలరేగిన విషయం తెలిసిందే. ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌లో ప్రధాన పేసర్లు బుమ్రాకు మాత్రం ఒక్క వికెట్ దక్కలేదు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణలు తలా రెండు వికెట్లు తీసినా.. భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అభిమాన్యు ఈశ్వరన్(39)ను నితీశ్ కుమార్ పెవిలియన్‌కు పంపాడు.

# స్పోర్ట్స్

## స్ట్రేలియా డబుల్ స్ట్రోక్ ..
## టీమిండియాకు ఆరో ఓటమి..!




యూరప్ గడ్డపై జరుగుతున్న హాకీ ప్రో లీగ్ లో భారత జట్టు ఆరో ఓటమి ఎదురైంది. ఇప్పటికే నెదర్లాండ్స్, అర్జెంటీనా చేతిలో పరాజయంతో కుమిలిపోతున్న టీమిండియా.. ఆస్ట్రేలియా చేతిలో వరుసగా రెండో ఓటమిని చవి చూసింది. గత పోరులో ఆఖర్లో గోల్స్ సమర్పించుకున్న భారత్.. ఈసారి ప్రత్యర్థిని నిలువరించలేక మళ్లీ విజయం వాకిట బొక్కబోర్లాపడింది. శనివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో హర్‌ప్రీత్ సింగ్ సేన 2–3తో వెనకబడింది.త మ్యాచ్‌లో మాదిరిగానే భారత ఆటగాళ్లు తొలి అర్ధ భాగంలోనే గోల్ సాధించారు. డిఫెండర్ సంజయ్ రానా 3వ నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ ద్వారా తొలి గోల్ అందించాడు. కానీ, ఆ తర్వాత ఆసీస్ ఆటగాళ్లు టిమ్ బ్రాండ్ (4వ నిమిషం), బ్లేక్ గోవర్స్ 5 వ నిమిషంలో గోల్స్ చేయగా భారత్ వెనకబడింది. అయితే.. దిల్‌ప్రీత్ సింగ్ 36వ నిమిషంలో గోల్ చేయగా టీమిండియా 2–2తో స్కోర్ సమం చేసింది. దాంతో 'హమ్మయ్య మ్యాచ్‌ను కాపాడుకుంటాం' అని హర్మన్‌ప్రీత్ సేన ధీమాగా ఉన్న వేళ.. భారత డిఫెండర్లను ఏమారుస్తూ కూపర్ బర్న్స్(36 నిమిషం) గోల్‌తో ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 27వ నిమిషంలో టీమిండియాకు రెండు పెనాల్టీ కార్నర్లు లభించాయి. కానీ.. వాటిని హర్మన్‌ప్రీత్ బృందం సద్వినియోగం చేసుకోలేకపోయింది. 400వ మ్యాచ్ ఆడుతున్న మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ తీవ్రంగా నిరాశపరిచాడు. మరో 10 నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా ఆసీస్ ఆటగాళ్లు రెండు పెనాల్టీ కార్నర్లు సాధించారు. అయితే.. గోల్ కీపర్ పాఠక్ వాటిని సమర్ధంగా అడ్డుకోవడంతో ఒక్క పాయింట్ తేడాతో భారత జట్టు పరాజయం పాలైంది. వరుసగా ఆరు ఓటములతో డీలాపడిన టీమిండి తదుపరి మ్యాచ్‌లో జూన్ 21న బెల్జియంతో తలపడనుంది.



# ఇవానాకు క్యూ కడుతున్న ఆఫర్లు

లేటెస్ట్ సెన్సేషన్ ఇవానా.. ఈ ముద్దుగుమ్మ చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ మొదలు పెట్టింది. ఆతర్వాత హీరోయిన్ గా మారింది. తమిళ్ లో లవ్ టుడే సినిమాతో పరిచయం అయ్యింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తెలుగులోనూ డబ్ అయ్యి మంచి హిట్ గా నిలిచింది. ఈ సినిమా తర్వాత ఇవానా రీసెంట్ గా సింగిల్ సినిమా చేసింది.శ్రీవిష్ణు హీరోగా నటించిన సింగిల్ సినిమా ఇటీవలే విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో ఇవానా తన అందంతో పాటు నటనతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమా సక్సెస్ ను ఎంజాయ్ చేస్తుంది ఇవానా. ఇక ఇప్పుడు ఈ చిన్నదానికి తెలుగులో క్రేజీ ఆఫర్స్ క్యూ కడుతున్నాయిఇదిలా ఉంటే తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఇవానా మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేసింది. చిన్నతనంలో హైట్ విషయంలో చాలా మంది ఏడిపించేవారు అని తెలిపింది. చిన్నప్పుడు నేను హైట్ తక్కువగా ఉండటంతో చాలా అవమానాలు, రిజక్షన్స్ ఎదుర్కొన్నా. స్కూల్‌లో నన్ను ఫ్రెండ్స్ 'పొట్టి' అని ఏడిపించేవారు అని తెలిపింది.వాళ్ల మాటలు చాలా బాధపెట్టేవి దాంతో నేను చదువు పై పెద్దగా దృష్టి పెట్టలేకపోయాను అని తెలిపింది. ఇక చిన్న వయసునుంచే సినిమాల పై ఇంట్రెస్ట్ ఉండేది అని చెప్పుకొచ్చింది. ఇవానాకు తెలుగులో 'హ్యాపీడేస్' అంటే చాలా ఇష్టమట. ఈ సినిమా సాంగ్స్ తన ఫేవరెట్ అని తెలిపింది అని చెప్పుకొచ్చింది.. అలాగే ఫేవరెట్ హీరో అల్లు అర్జున్.ఇక ఈ చిన్నదనికి ఇప్పుడు వరుసగా అవకాశాలు అందుకుంటుంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది తన ఫొటోలతో ఆకట్టుకుంటుంది.



# ప్రభాస్ 'రాజాసాబ్' టీజర్ టైం ఫిక్స్..
## ప్రీ టీజర్ చూశారా.!

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది రాజా సాబ్ . మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా నుంచి టీజర్ విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. జూన్ 16న టీజర్ విడుదల చేయనున్నారు మేకర్స్. తాజాగా దీనికి సంబంధించి మరో అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ సినిమా టీజర్‌ను రేపు ఉదయం 10.52 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా ప్రీ టీజర్ ప్రోమోను పంచుకుంది.

# ముంబై లోకల్ ట్రైన్‌లో నటి మాళవికాకు చేదు అనుభవం..
## స్పందించిన ముంబై పోలీసులు

తంగలాన్, మాస్టర్ వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంది నటి మాళవిక మోహనన్. అయితే ఈ నటి తనకు ముంబై లోకల్ ట్రైన్‌లో ఎదురైన ఒక చేదు అనుభవం గురించి తాజాగా పంచుకోగా.. దీనిపై స్పందించారు ముంబై పోలీసులు.మాళవికా మోహనన్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన కాలేజ్ డేస్‌లో రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ముంబై లోకల్ ట్రైన్‌లో తన స్నేహితురాళ్లతో కలిసి ప్రయాణిస్తుండగా ఈ సంఘటన జరిగిందని వివరించారు. మేము కూర్చున్న ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ దాదాపు ఖాళీగా ఉందని, అప్పుడు ఒక వ్యక్తి కిటికీ గ్రిల్‌కు దగ్గరగా వచ్చి, ఏక్ చుమ్మా దేగి క్యా? (ఒక ముద్దు ఇస్తావా?) అని అసభ్యంగా అడిగాడని మళావిక తెలిపారు. ఆ సమయంలో తాము ముగ్గురం పూర్తిగా నిస్సహాయంగా ఉండిపోయామని, ఏం చేయాలో తెలియక భయంతో వణికిపోయామని ఆమె పేర్కొన్నారు. సుమారు 10 నిమిషాల తర్వాత తదుపరి స్టేషన్ రావడంతో ప్రయాణికులు కంపార్ట్‌మెంట్‌లోకి రావడంతో తాము ఊపిరి పీల్చుకున్నామని చెప్పారు. అయితే ఈ సంఘటనపై ముంబై పోలీసులు తమ అధికారిక సోషల్ మీడియా అకౌంట్ ద్వారా స్పందించారు. డియర్ మాళవిక గారు.. "మీరు మీ అనుభవాన్ని పంచుకోవడం, నగరంలో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేయడం మేము చూశాం. ఇలాంటి అనుభవాలు షాకింగ్‌గా ఉండటమే కాకుండా దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపిస్తాయని మేము అర్థం చేసుకోగలం. కాబట్టి, పగలు లేదా రాత్రి ఏ సమయంలోనైనా, నగరంలో ఏ ప్రదేశంలోనైనా మీకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే, దయచేసి 112/100 నంబర్‌లకు కాల్ చేయండి. మేము వీలైనంత త్వరగా సహాయం అందిస్తాము. ఫిర్యాదు చేయకపోవడం వల్ల నేరస్థులు మరింత ధైర్యం పొందుతారు అని పోలీసులు తెలిపారు. ముంబై నగరం మహిళలకు ఎప్పుడూ సురక్షితమైనది, దానిని మరింత మెరుగుపరచడానికి మేము ఎటువంటి ప్రయత్నం వదిలిపెట్టము. ఒకసారి ఫిర్యాదు చేస్తే, నేరస్థుడిని చట్ట ప్రకారం తగిన విధంగా శిక్షిస్తామంటూ ముంబై పోలీసు విభాగం తెలిపింది.






# ఏ మాయ చేశావే' రీ-రిలీజ్.. థియేటర్లలోకి రొమాంటిక్ క్లాసిక్!

టాలీవుడ్ నటులు నాగ చైతన్య, సమంత జంటగా గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ఏ మాయ చేశావే. 2010లో విడుదలైన ఈ చిత్రం యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా.. నాగ చైతన్యకు లవర్ బాయ్ ఇమేజ్‌ని తీసుకొచ్చింది. అలాగే సమంతను హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం చేసింది. ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం, పాటలు ఇప్పటికీ యువతకు ఇష్టమైన ప్లేలిస్ట్‌లో ఉన్నాయి. ఈ సినిమా నాటికీ నేటికీ ఒక క్లాసిక్ రొమాంటిక్ చిత్రంగా నిలిచిపోయింది. అయితే ఈ సినిమా వచ్చి 15 ఏండ్లు అవుతున్న సందర్భంగా మేకర్స్ రీ రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాను జూలై 18న రీ-రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. సినిమా చిత్రీకరణ సమయంలోనే చైతన్య, సమంతల మధ్య ప్రేమ చిగురించింది. ఆ తర్వాత వారు వివాహం చేసుకుని, కొన్ని సంవత్సరాల తర్వాత విడిపోయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమా రీ-రిలీజ్ అవుతుండటంతో, వారిద్దరూ ప్రమోషన్లలో పాల్గొంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492